

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం వంతడపలలో పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

దరఖాస్తులు 300.. అర్హులు 40 మందే!

- తప్పుల తడకగా రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితా
- కార్యదర్శిని నిలదీసిన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

నర్సింహులపేట, జనవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన రేషన్‌కార్డుల జాబితా ప్రజలను గందరగోళంలో పడేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికం చేయడంతో కులగణనలో ప్రతిఒక్కరూ కొత్త రేషన్ కార్డు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు కోసం పేర్లను నమోదు చేయించుకున్నారు. సర్వేలో రాయించుకున్న వారి పేర్లు జాబితాలో రాకపోగా, అనర్హులకు పేర్లు ఉండడంతో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం వంతడపల గ్రామంలో ఆదివారం గ్రామ కార్యదర్శి రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసాలో వచ్చిన పేర్లను చదివి వినిపించారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉండడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కులగణన సమయంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వాళ్లు కూడా గ్రామానికి వచ్చి తమకు రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు కావాలని సర్వేలో నమోదు చేయించుకున్నారు. గ్రామం నుంచి 300 నుంచి 400 మంది రేషన్ కార్డుల కోసం సర్వేలో నమోదు చేసుకోగా, కేవలం 40 మంది పేర్లు మాత్రమే రావడమేంటని కార్యదర్శిని ప్రశ్నించారు. జాబితాలో అర్హుల పేర్లు లేకుండా, తాత్కాలికంగా నివాసముంటున్న వివిధ రాష్ట్రాలకు చెందిన వారి పేర్లు, అనర్హుల పేర్లు రావడంతో గొడవలు మొదలయ్యాయి. లిస్టులో పేర్లు లేని వారంతా గ్రామపంచాయతీ వద్దకు వెళ్లి తమ పేర్లు ఎలా తొలగించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ పేర్లు అర్హుల జాబితాలో చేర్చకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందంటూ హెచ్చరిస్తున్నారు.

లిస్టులో నా పేరు లేదు

కులగణన సమయంలో అధికారులు మా ఇంటికి వచ్చారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న. మా ఇంటికి రెండు ప్రజాపాలన స్టిక్కర్లు పెట్టారు. తీరా ఇప్పుడు చూస్తే నాపేరు లిస్టులో లేదు. అధికారుల తప్పిదం వల్ల నాకు రేషన్ కార్డు లేకుండాపోయింది. మరోసారి రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోమంటున్నారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలి. తప్పులు చేసిన అధికారులపై చర్య తీసుకోవాలి.

- కమటం వెంకన్న, వంతడపల, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు

ఉద్యోగస్థుల పేర్లున్నాయి

మా గ్రామంలో రేషన్‌కార్డు కోసం 300 మంది అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో మాత్రం 40 పేర్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో కార్డు ఉన్నవారు, ఉద్యోగం ఉన్నవారి పేర్లు ఉన్నాయి. వ్యవసాయం ఉన్న వారి పేర్లు ఆత్మీయ భరోసాలో చేర్చారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా అందించే విధంగా చూడాలి.

- వెలిశాల యాకయ్య, వంతడపల

'స్థానిక' ఎన్నికలపై గందరగోళం

- బీసీల రిజర్వేషన్లపై సందిగ్ధం
- ఇప్పటికీ కొలిక్కిరాని కులగణన
- అందని డెడికేటేడ్ కమిషన్ నివేదిక
- 50 శాతం కోటా దాటాలంటే పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిందే
- అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని నిర్ణయించిన రాష్ట్ర సర్కారు
- వెరసి ఎన్నికలు మరికొంత కాలం ఆలస్యమయ్యే అవకాశం

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై గందరగోళం నెలకొన్నది. జనవరి చివరి వారంలో నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి 15లోగా సర్పంచ్ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అడుగు ముందుకుపడటం లేదు. జనవరి నెల మూడో వారం పూర్తికావస్తున్నా దానిపై స్పష్టత రావడం లేదు. రాష్ట్రంలో వివిధ కులాల జనాభా, వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు తెలుసుకునేందుకు చేపట్టిన కులగణన సర్వేకు మంత్రివర్గ ఆమోదం లభించలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు లక్ష్యంగా నియమించిన డెడికెటేడ్ కమిషన్ నివేదిక అందలేదు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే పరిస్థితులు కనిపించడం లేదు.

ఏడాదైనా సందిగ్ధమే..

సర్పంచుల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది కావస్తున్నది. అయినప్పటికీ ఎన్నికల నిర్వహణపై ఏర్పడిన సందిగ్ధం తొలగడం లేదు. క్షేత్రస్థాయి నాయకత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్నా ప్రభుత్వం మాత్రం ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు త్వరలోనే ఎన్నికలంటూ తరచూ ఊదరగొడుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. 42 శాతం బీసీ కోటా కేటాయింపు, కులగణన సర్వేకు చట్టబద్ధతపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరోవైపు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నదని అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తగలడం ఖాయమని లోలోన దిగులు పడుతున్నారు. దీంతో ఈ నెల 26 నుంచి రైతుభరోసా, రైతు కూలీలకు నగదు చెల్లింపు, ఇందిరమ్మ ఇండ్ల పథకం, రేషన్‌కార్డుల పంపిణీని పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే క్యాడర్ నీరుగారిపోకుండా ఉండేందుకే త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ఊదరగొడుతున్నట్టు తెలుస్తున్నది.

చట్టపరమైన చిక్కుముడులెన్నో..

రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా ఎన్నికలకు చట్టపరమైన చిక్కుముడులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కేంద్రం అనుమతి లేకుండానే చేపట్టిన కులగణన నివేదికను బహిర్గతం చేయడం ద్వారా న్యాయపరమైన సమస్యలు ఎదురుకానున్నాయి. గతంలో బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో చేపట్టిన కులగణన కోర్టుల్లో నిలబడలేదు. ఈ పరిస్థితుల్లో మన రాష్ట్రంలో చేపట్టిన కులగణన నివేదికను బహిర్గతం చేస్తే దానిపై ఎవరైనా కోర్టుకు వెళ్తే సర్కారుకు చుక్కెదురయ్యే అవకాశాలు ఉంటాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. గతంలో వివిధ రాష్ట్రాల్లో ఎదురైన పరిస్థితులు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను వారు ఉదహరిస్తున్నారు.

42 శాతం కోటా తేల్చడం కష్టమే..

బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఇందుకోసం బీసీ కమిషన్ ఏర్పాటుతో పాటు కులగణన చేపడుతున్నామని చెప్పింది. అయితే బీసీ కమిషన్‌కు రిజర్వేషన్లు ప్రతిపాదించే అధికారం లేదని బీసీ సంఘాలు, న్యాయకోవిదుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వం నవంబర్ 4న డెడికేటేడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వివరాలు సేకరించింది. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వానికి నివేదిక అందించలేదు. అయితే ఈ కమిషన్ 42 శాతం ఇవ్వాలని ప్రతిపాదించినా ఆచరణ సాధ్యంకాదని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే స్థానిక ఎన్నికల్లో 50 శాతం కోటా దాటితే కోర్టుల్లో చెల్లుబాటు కాదని పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ట్రిపుల్ టెస్ట్ పాసయ్యే అవకాశం ఎంత మాత్రం లేదంటున్నారు.

ఆలస్యం అనివార్యం..

ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొనడం, మరోవైపు చట్టపరమైన చిక్కులు కొలిక్కివచ్చే అవకాశాలు లేకపోడంతో ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రెండు వారాల్లో సర్పంచ్ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తామని ఎలక్షన్ కమిషన్ అధికారులు చెబుతున్నా ప్రభుత్వం మాత్రం ఇందుకు సంసిద్ధత తెలపడం లేదు. ఎందుకంటే పథకాల ఫలాలు అందకపోవడం, చట్టపరమైన ఇబ్బందుల నేపథ్యంలో కక్కలేని, మింగలేని పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. ఈ వ్యవహారాలన్నీ కొలిక్కి వచ్చిన మీదటే స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సుమారు మూడు, నాలుగు నెలలు పట్టే అవకాశం లేకపోలేదు.

రాజ్యాంగ సవరణ తప్పనిసరి..

ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం కోటాకు మించి రిజర్వేషన్లు ఇవ్వాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరని న్యాయకోవిదులు చెబుతున్నారు. మరి కేంద్రం అందుకు అనుమతిస్తుందా? అనే విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఒక రాష్ట్రానికి అనుమతి ఇస్తే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఇదే డిమాండ్ వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో చట్ట సవరణకు అంగీకరించే పరిస్థితులు ఎంత మాత్రం కనిపించడం లేదు. ఒకవేళ బీసీ రిజర్వేషన్లు లేకుండానే ఎన్నికలకు వెళ్తే ఆయా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు బీసీ వర్గానికి చెందిన మంత్రులు సైతం ఇందుకు ఒప్పుకొనే అవకాశాలు కపిపించడం లేదు.

దైవ దర్శనానికి వెళ్తున్న వాహనం బోల్తా

- డీసీఎంలో 80 మంది ప్రయాణం ఒకరి మృతి.. 40 మందికి గాయాలు
- రిమ్స్, ఉట్నూర్ దవాఖానల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మాల్కుగూడ మూలమలుపు వద్ద బోల్తాపడ్డ డీసీఎం వాహనం

నార్నూర్/ఇంద్రవెల్లి/ఎదులాపురం, జనవరి 19 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సూర్యగూడకు చెందిన ఆదివాసులు 80 మంది వరకు మహారాష్ట్రలోని జంగుబాయి దర్శనానికి ఆదివారం డీసీఎం వాహనంలో బయలుదేరారు. నార్నూర్ మండలంలోని మాల్కుగూడ మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొమ్మిది అంబులెన్స్‌లు, ప్రైవేటు వాహనాల్లో నార్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. 15 మంది పరిస్థితి విషమంగా ఉండడంతో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అందులోనుంచి కొందరి పరిస్థితి మరింత విషయమంగా ఉండడంతో రిమ్స్‌కు తీసుకెళ్లారు. రిమ్స్‌లో కుమ్ర మల్కు, కుమ్మర రాంబాయి, మేస్రం నాని, కుమ్రం భీంరావు, జంగుబాయిలు చికిత్స పొందుతున్నారు. ఇందులో కుమ్ర మల్కు(61) తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది.

చద్మల్‌తండాలో నకిలీ నోట్ల కలకలం

గాంధారి, జనవరి 19: కామారెడ్డి జిల్లా గాంధారి మండలం చద్మల్‌తండాలో నకిలీ 500 నోట్లు కలకలం రేపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చద్మల్‌తండాలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా లక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధికి భక్తులు పెద్ద మొత్తంలో కానుకలు, విరాళాలు సమర్పిస్తారు. ఆ డబ్బులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తండాలో అవసరం ఉన్న వారికి వడ్డీకి ఇస్తారు. కమిటీలోని ఓ బాధ్యుడు ఉత్సవాల అనంతరం వడ్డీకి ఇచ్చి, తిరిగి జాతర సందర్భంగా వాటిని తీసుకుంటాడు. రూ.కోటి వరకు ఆలయ డబ్బులు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా జాతర అనంతరం డబ్బులను తండాలో అవసరం ఉన్న పలువురికి వడ్డీకి ఇచ్చారు. కాగా ఇందులో ప్రతి ఐదు వందల నోట్ల కట్టలో నాలుగు నకిలీ నోట్లు ఉన్నట్లు కొందరు గుర్తించారు. ఈ విషయమై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. తండాలోని పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది.

మాజీ ఎమ్మెల్యేపై అనుచిత పోస్టులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నాయకులు

రామడుగు మండల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు అర్జున్

రామడుగు, జనవరి 19 : కరీంనగర్ జిల్లా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌పై సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా చేస్తున్న అనుచిత పోస్టులపై ఆదివారం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ రామడుగు మండల శాఖ అధ్యక్షుడు శనిగరపు అర్జున్ ఆధ్వర్యంలో నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన అర్జున్ మాట్లాడుతూ కొంత కాలంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ లక్ష్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, తదితర సామాజిక మాధ్యమాల్లో కించపరిచేలా ట్రోల్ చేస్తూ పోస్టులు పెడుతూ పైచాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. సంబంధిత వ్యక్తులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు లంక మల్లేశం, పూడూరు మల్లేశం, తడగొండ రాజు, జుట్టు అంజయ్య, పురాణం రమేష్, అశోక్, ప్రభాకర్, రాకేశ్, తదితరులు ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సినారె

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయేంద్ర రెడ్డి తదితరులు

కమాన్‌చౌరస్తా, జనవరి 19: కల్మశం తెలియని మహా మనిషి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సినీ గేయ కవి, సినారె అని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, సినారె కవితా పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేంద్ర రెడ్డి కొనియాడారు. కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన విశ్వంభరుడు కవితా సంకలనాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. సినారె తెలియని తెలుగు వారుండరని, పలు ప్రక్రియలలో శతాధిక గ్రంథాలను మనకు అందించిన మహా కవి అని కీర్తించారు. అనంతరం ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కలువకుంట రామకృష్ణ మాట్లాడుతూ సినారె బహుభాషావేత్త అని, అందరినీ ఆదరించిన అలుపెరుగని సాహితీ దిగ్గజమని ప్రశంసించారు. కాగా, అన్నాడి గజేందర్ రెడ్డి ప్రధాన వక్తగా పుస్తకాన్ని సమీక్షించగా, నగునూరి రాజన్న ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, ఉదయ సాహితి జిల్లా అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, వేములవాడ ద్రోణాచార్యులు, గంప ఉమాపతి, బొమ్మకంటి కిషన్, పీ సత్యనారాయణరాజు, బొద్దుల లక్ష్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్, జితేందర్ రావు గూడెపు కుమార్, వెల్ముల జయపాల్ రెడ్డి, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, ఇటిక్యాల రాము ఉన్నారు.

వాకర్స్‌కు క్రీడలు

హుజూరాబాద్ టౌన్, జనవరి 19: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్‌కు రన్నింగ్, వాకింగ్, షాట్ పుట్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక్కడ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హాకీ క్లబ్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్ రావు, తోట రాజేంద్ర ప్రసాద్, చింత శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోవర్ధన్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ముక్తి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు రమేశ్, రిటైర్డ్ పీడీ కొన్ని రాజిరెడ్డి, పీఈటీ భాగ్యలక్ష్మి, వేల్పుల రత్నం, మతిన్, వేణు, కొలిపాక సారయ్య, సాదుల రవీందర్ బాబు, మౌటం రవీందర్, సదానందం పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఫైనల్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు

- నేటి ఉదయమే పోరు

పోటీల్లో తలపడుతున్న జిల్లా జట్టు క్రీడాకారులు

కొత్తపల్లి, జనవరి 19: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్, వరంగల్ జట్లు అద్భుత ప్రతిభచూపి ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం రెండో రోజు పోటీలను రిజర్వ్ ఇన్‌స్పెక్టర్స్ కే కుమారస్వామి, మోడం సురేశ్ ప్రారంభించగా, హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23-21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొంది ఫైనల్‌కు ప్రవేశించింది. రెండో సెమీఫైనల్‌లో వరంగల్ జట్టు 28-15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై గెలుపొంది ఫైనల్‌కు చేరింది. సోమవారం ఉదయం ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఇక్కడ తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, పోటీల పరిశీలకులు దీపక్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, కోశాధికారి కనకయ్య, సంఘ రాష్ట్ర బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు మల్లేశ్, శ్రీనివాస్, రాజశేఖర్, జయంత్, అమర్, శివాజీ పాల్గొన్నారు.

అనుమతులు లేని అసోసియేషన్‌తో క్రీడాకారులకు అన్యాయం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్

అనుమతిలేని హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌తో క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు 52 ఏళ్ల చరిత్ర ఉందని, దీని పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు అనుబంధంగా జిల్లాస్థాయి అసోసియేషన్లు కొనసాగుతున్నాయన్నారు. కరీంనగర్‌లో 2021లో ఏర్పాటైన ఒలింపిక్ అసోసియేషన్‌ను స్పోర్ట్స్ అథారిటీ పరిశీలన జరుగకుండానే నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని, ఎలాంటి అర్హతలు లేకున్నా జాతీయ పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అసోసియేషన్ నుంచి ఎలాంటి అనుమతి లేకున్నా, ఉన్నట్లు చూపుతూ క్రీడాకారులను తప్పుదోవ పట్టిస్తున్న నాయకుడు, సంఘంపై సీపీతో పాటు, శాట్, ఒలింపిక్ సంఘాలకు ఫిర్యాదు చేయనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విద్యానగర్, జనవరి 19: నగరంలోని హనుమాన్ నగర్, వడ్డెర బస్తీలో మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, డాక్టర్ ఎల్ శేషశైలజ సంయుక్త ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. వైద్యులు జనరల్ ఫిజీషియన్ స్వాతి, పిల్లల వైద్య నిపుణులు కే సప్త ఋషి, ఎంఎస్ ఈఎన్‌టీ డాక్టర్ లికిత, ఆస్మా బేగం, తోట ప్రమోద్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ రమేశ్, అస్మా అంజుమన్, ఇతర డాక్టర్ల సహాయక బృందం 128 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, మాధవ సేవ సమితి అధ్యక్షులు ఎల్లంకి హనుమంతరావు, కార్యదర్శి జి మహేశ్వర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కామారపు ప్రసాద్, సభ్యులు ఎన్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ

- మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్ టౌన్, జనవరి 19: క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక క్రీడాకారులకు సూచించారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు, సెలక్స్స్ జరుగగా, 18 బాలుర జట్లు, 8 బాలికల జట్లు పాల్గొన్నాయి. హుజూరాబాద్ జట్టు బాలుర విభాగంలో విజేతలుగా నిలువగా, బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు విజేతగా నిలిచింది. బాలికల హుజూరాబాద్, బాలుర కరీంనగర్ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక బహుమతులు ప్రదానం చేశారు. కాగా, విజేతలు త్వరలో వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు మోటం రవీందర్ తెలిపారు. ఇక్కడ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హాకీ క్లబ్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, హాకీ క్లబ్ శాశ్వత అధ్యక్షులు తోట రాజేంద్రప్రసాద్, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్ రెడ్డి, ముక్క రమేశ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,ముత్యం రాజు, నిర్వాహకులు సునీల్ రెడ్డి, నీరటి రమేశ్, రవీందర్, నాయకులు తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, గందె శ్రీనివాస్, దామోదర్ రమేశ్ పాల్గొన్నారు.

WATCH & ENJOY RELOADED VERSION IN THEATRES
మల్టిప్లెక్స్ టికెట్ ధర : 295/- 150/-, 350/- 200/-
సింగిల్ స్క్రీన్స్ టికెట్ ధర : 112/-, 90/-, 55/-,


సంధ్య 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 10.00,2.00,6.00,10.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
MYTHRI THEATRES కిమల్ 70 - బాలానగర్ 8.00AM 64 Channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditioned
MYTHRI THEATRES రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 10.45,2.45
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
మీరజ్ సినిమాస్ - చందానగర్
AMB ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి
Cinépolis BANJARA HILLS లూలూ మాల్ - కూకట్‌పల్లి
ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
INOX LIVE THE MOVIE M.P. Malakpet బి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
Cinépolis MALAKAPET CCPL - మల్కాజ్‌గిరి
MOVIETIME ప్లాటినమ్ - అమీర్‌పేట్
PVR గలేరియా - పంజాగుట్ట
INOX LIVE THE MOVIE BANJARA HILLS అశోక ఎ/సి - వై.జంక్షన్
Cinépolis DSL-Uppal డి.ఎల్.ఎస్ - ఉప్పల్
MOVIETIME ఫ్లైమాల్ - సనత్‌నగర్
PVR పివిఆర్ - ఎర్రమంజిల్
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
Cinépolis టిఎన్ఆర్ ఎ/సి - కొంపల్లి
MOVIETIME యస్ఎల్‌టి - గచ్చిబౌలి
PVR పివిఆర్ - మూసారంబాగ్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
AMB ఎఎంఆర్ - మౌలాలి
TIVOLI టివోలి - సికింద్రాబాద్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
పివిఆర్‌యస్2 - వరంగల్
పివిఆర్ వేణు - నిజామాబాద్
MYTHRI THEATRES శ్రీకృష్ణ - మహబూబ్‌నగర్
వెంకటేశ్వర - మంచిర్యాల
MYTHRI THEATRES కెపియస్ (ఆదిత్య) - ఖమ్మం 11.00AM
వెంకటరమణ - సిరిపూర